## 'డయల్ యువర్ డీఎం'కు స్పందన

**ఫతేనగర్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు ప్రయాణికుల నుంచి స్పందన లభించిందని డీఎం డి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారని అన్నారు. కేపీహెచ్‌బీ 4వ ఫేజ్ వద్ద కంట్రోలర్‌కు ఏర్పాటు చేయాలని, ప్రగతినగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రయాణికులు కోరినట్టు డీఎం వివరించారు. గతంలో ఉన్న విధంగా ఉదయం 10 నుంచి 4 వరకు సీనియర్ సిటిజన్లకు అందజేసిన రూ.50 టికెట్‌ను పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్ ప్రతినిధి ఒకరు తనను కోరినట్టు డీఎం స్పష్టం చేశారు. ప్రయాణికులు తన దృష్టికి తీసుకొచ్చిన అన్నింటిని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టు డీఎం వెల్లడించారు.

## నేడు మధ్యాహ్నం 3 నుంచి..

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తమ సమస్యలను నేరుగా తెలిపేందుకు శనివారం 99592 26148 ఫోన్ నెంబరులో అందుబాటులో ఉంటున్నట్టు కూకట్‌పల్లి ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (డీఆర్ఎం - ఆపరేషన్స్) ఆర్.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కూకట్‌పల్లి, మియాపూర్-2, జీడిమెట్ల, హెచ్‌సీయూ, మేడ్చెల్ డిపో ప్రాంతాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇవ్వాలనుకునే ప్రయాణికులు నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పొచ్చని ఆమె స్పష్టం చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఓల్డుబోయినపల్లి, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి):** బోయినపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ గౌతమీనగర్, రామరాజునగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని బోయినపల్లి డీఈ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమీనగర్ ఫీడర్ పరిధిలోని గౌతమీనగర్, ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డు, ఎన్ఎస్‌కేకే స్కూల్, సాయినగర్, రామరాజునగర్ ఫీడర్ పరిధిలోని రామరాజునగర్, శంకర్‌ఎన్‌క్లేవ్, సమతానగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11 వరకు, విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ స్పష్టం చేశారు.

### వినాయకనగర్ ఫీడర్ పరిధిలో..

**కేపీహెచ్‌బీకాలనీ:** టీజీఎస్‌పీడీసీఎల్ వసంతనగర్ సెక్షన్ పరిధిలో శనివారం వినాయకనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు వసంతనగర్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2, ఎన్ఆర్ఎస్ఏ, ఎస్పీ నగర్, వెంకట రమణ, గోకుల్ ప్లాట్స్, ధర్మారెడ్డి ఫేజ్-2, సీబీసీఐడీ, మెడో ల్యాండ్స్, ఎస్ఎస్ కాలనీ, డైమండ్ హిల్స్, హైదర్‌నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన



సఫ్దర్ నగర్ డీ-బ్లాక్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

**అల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్ నగర్ డి-బ్లాక్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ సబీహ బేగం పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత పాటించాలని సూచించిన కార్పొరేటర్ సబీహ బేగం, నూతన రోడ్డు నిర్మాణంతో సఫ్దర్ నగర్ డీ-బ్లాక్ వాసులకు ప్రయోజనం కలుగనుందని, కాలనీవాసుల సమష్టి కృషి, ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అభివృద్ధి పనులు ఒకటొకటిగా పూర్తి చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సఫ్దర్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, బాబా, సయద్ మహమ్మద్, సలీం పాల్గొన్నారు.

## 'కామిక్ కాన్ ఇండియా' ప్రారంభం



విచిత్ర వేషధారణలో యువత

**మోతీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** నగరంలో మూడు రోజులపాటు జరగనున్న కామిక్ కాన్ ఇండియా వేడుకలు శుక్రవారం హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. పాశ్చాత్త సంస్కృతి, యానిమేషన్ గేమింగ్‌ను ఆస్వాదించే నగర ప్రజలు ఈ వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం మూడు విభాగాలుగా ఏర్పాటు చేసిన ఈ హైదరాబాద్ కామిక్ కాన్ 2024 వేడుకల్లో యానిమేషన్ గేమింగ్, పాప్ కల్చర్, నేషనల్ ట్రావెలింగ్ విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మారుతి సుజుకి, యమహా ఆటోమొబైల్ సంస్థలు ఏర్పా టు చేసిన స్టాల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో యానిమేషన్ వేషధారణలోని వ్యక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈసందర్భంగా కామిక్ కాన్ ఇండి యా సహ వ్యవస్థాపకులు, ఎండీ అక్షిత్‌రాది మాట్లాడుతూ.. ఈ ఈవెంట్స్‌ను మారుతి సుజుకి సమస్త ఏర్పాటు చేసిందన్నారు. ఈవేడుకలు ఉపఖండంలోనే అతిపెద్దవని.. పాశ్చాత్య సంస్కృతిని ఇష్టపడే ప్రజలకు ఇది ఒక గొప్ప అనుభూతి అన్నారు.




కూకట్‌పల్లి శివాలయంలో కార్తీక దీపం వెలిగిస్తున్న మహిళ, శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న యువతి





బాలానగర్‌లో శివాలయంలో మొక్కుతున్న యువతి, కార్తీక దీపం వెలిగిస్తున్న మహిళ, ఐడీపీఎల్‌లోని శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



బాలానగర్ సాయినాగేంద్ర ఆలయంలో జ్వాలా తోరణం పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అంబటి సునీల్, ఆలయ కమిటీ సభ్యులు

# కార్తీక శోభ

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు



హరిహరా క్షేత్రంలో పూజలు నిర్వహించిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌తో ఆలయ కమిటీ సభ్యులు



కూకట్‌పల్లి పరిధిలోని శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-5లోని రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

**బాలానగర్/ ఫతేనగర్/ ఓల్డుబోయినపల్లి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి):** కార్తీక పౌర్ణమి సందర్భంగా బాలానగర్ ప్రధాన రహదారి పక్కన, ఫతేనగర్‌లోని అతి పురాతన శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వీటితో పాటు ఓల్డుబోయినపల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, భరత్‌నగర్ శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారు జామునుంచే శివాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తితో స్వామివారికి అభిషేకం చేసి భక్తితో కొలిచారు. సాయంత్ర 4గంటల నుంచి కార్తీక దీపాలు వెలిగించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చారు. కార్తీక దీపాలు వెలిగించి తమకుటుంబ సభ్యులపై దైవానుగ్రహం ఉండాలని భక్తితో వేడుకున్నారు.

- **కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-5లోని రామాలయం ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం అన్న సమరాధన చేశారు. సాయంత్రం జ్వాల తోరణం పూజ చేశారు.
- **ఫతేనగర్:** భరత్‌నగర్ హరిహర కళాక్షేత్రంలో కూకట్‌పల్లి జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్‌కుమార్‌ను సత్కరించారు. జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, ఆడ బాల షణ్ముక, సూర్య, వీర, పులగం సుబ్బు, కమిటీ సభ్యులు మూర్తి, నాగరాజు, అశోక్ ముదిరాజ్ పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ కాలనీలోని శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో భక్తులు



బతుకమ్మ రోడ్డులో పేరుకు పోయిన చెత్త



దీన్‌దయాల్‌నగర్ వెళ్లే దారిలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు



శోభనా కాలనీ వెళ్ళే దారిలో నాలా పక్కన పేరుకు పోయిన చెత్త

# ఎక్కడి చెత్త అక్కడే

ఫతేనగర్ డివిజన్‌లో పారిశుధ్యం పడకేసింది. బస్తీల్లో చెత్తకుప్పలు పేరుకుపోతుండడంతో దుర్వా సన వేస్తోంది. డివిజన్ పరిధి బతుకమ్మ రోడ్డు, ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డు, పార్థీవ్‌వాడ, బాలానగర్ కో ఆపరేటీవ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, దీన్‌దయాల్‌నగర్, భరత్‌నగర్ నుంచి ఫతేనగర్‌నగర్ వెళ్లే రోడ్డు, భరత్‌నగర్ మార్కెట్ వద్ద చెత్త కుప్పలు దర్శనమి స్తున్నాయి. పేరుకుపోయిన చెత్తకుప్పల్లో దోమలు, ఈగలు వాలడం, పందులు, కుక్కలు చెత్తలో దొర్లుతూ రోడ్డుకు అడ్డంగా పరుగులు తీస్తున్నాయి. చెత్తకుప్పలను సిబ్బంది కొన్ని ప్రాంతాల్లో ఎప్పటి కప్పుడు తొలగిస్తున్నప్పటికీ మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం తీయకుండా వదిలేస్తున్నారు. చెత్త కుప్పల్లో పేరుకుపోయిన కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మూగ జీవాలు వాటిని తింటుండడం చూస్తుంటే మనసు కలిచి వేస్తోందని స్థానికులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి చెత్త కుప్పలను ఎప్పకప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఫతేనగర్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి)



శివాలయం రోడ్డు నాలా పక్కన పేరుకు పోయిన చెత్త

## రైతుబజార్‌లో ధరలు

**కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.23, వంకాయ రూ.40, బెండకాయ రూ.40, పచ్చి మిర్చి రూ.30, బజ్జి మిర్చి రూ.65, కాకరకాయ రూ.25, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.31, బీన్స్ రూ.50, క్యారెట్ రూ.65, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.23, చిక్కుడు కాయ రూ.60, గోరు చిక్కుడు రూ.32, బీట్‌రూట్ రూ.45, క్యాప్సికం రూ.70, ఆలుగడ్డ రూ.37, కీర రూ.17, దోసకాయ రూ.28, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.65, ఉల్లిపొరక రూ.65, ఉల్లిగడ్డ రూ.45, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.39, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.35, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.90. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.


## మార్కుల సమస్యకు 24గంటల్లో పరిష్కారం!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- స్పందించిన జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు
- ప్రిన్సిపాల్, సీఎస్ఈ విభాగాధిపతి, మరో ఇద్దరు ప్రొఫెసర్లకు షోకాజ్ నోటీసులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూ కాలేజీ విద్యార్థులకు రావాల్సిన మార్కుల్లో అకారణంగా కోతపెట్టిన ప్రొఫెసర్లపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. మార్కుల జాబితాల్లో తప్పులు దొర్లాయని తెలిసినప్పటికీ పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, సీఎస్ఈ విభాగాధిపతిపైనా ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ బుర్రా వెంకటేశ్వం ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జరిగిన తప్పిదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని వర్సిటీ రెక్టార్, రిజిస్ట్రార్‌లను ఆదేశించారు. వీసీ ఆదేశాల మేరకు శుక్రవారం సెలవు దినమైనప్పటికీ సీఎస్ఈ విభాగాధిపతితో పాటు మరో ఇద్దరు ప్రొఫెసర్లను, కళాశాల అధికారులను యూనివర్సిటీకి పిలిపించి విచారణ చేపట్టారు. క్యాంపస్ కాలేజీలో 150మంది విద్యార్థులకు అన్యాయం జరిగితే.. తమ దృష్టికి తీసుకు రాకపోవడ మేంటని ప్రశ్నించారు. మార్కుల జాబితాల్లో తప్పులు దొర్లిన విషయం బాధిత విద్యార్థులు తెలిపినప్పటికీ, స్పందించకపోవడంపై వివరణ కోరారు. జరిగిన తప్పిదంలో ఎవరిపాత్ర ఎంత అనేదానిపై సోమవారం లోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. 24గంటల(శనివారం)లోగా తప్పులను సరిదిద్ది కొత్త మార్కుల జాబితాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వర్సిటీ రెక్టార్, రిజిస్ట్రార్ నిర్ణయించారు. బాధిత విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

## కులగణనతో ప్రయోజనం



డీసీ వంశీకృష్ణను శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నేత రాఘవేంద్ర, బీసీ సంక్షేమ సంఘం చైర్మన్ నిరంజన్

**అల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** బీసీ సంక్షేమ సంఘం చైర్మన్ నిరంజన్‌ను మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కులగణన కార్యక్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత గోపిశెట్టి రాఘవేంద్ర ఆధ్వర్యంలో అవంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాఘవేంద్ర.. ప్రభుత్వం ప్రస్తుతం తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనతో అనేక ప్రయోజనాలున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల వారికి అందించేందుకు దోహదపడుతుందని, రాష్ట్ర ప్రగతికి విధానాలను రూపొందించేందుకు ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అవంతి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ కమిషన్ చైర్మన్ ఇంట్లో సర్వేలో డీసీ

**కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):** సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం మోతీనగర్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఇంటికి ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, కమ్యూనిటీ ఆర్గనైజర్‌తో కలిసి మూసాపేట్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ పాల్గొన్నారు. సర్వేలో ప్రశ్నలను అడిగి సమాధానాలను బుక్‌లెట్‌లో రాసుకున్నారు.

### కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు

## మోదీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

**సికింద్రాబాద్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి):** రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం సేకరించిన రక్షణ శాఖ భూములకు బదులుగా కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన రూ. 303.62 కోట్లను సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని నిర్ణయం తీసుకోవడానికి మోదీ సర్కారే కారణమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ చెప్పారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డైరీ ఫాం రోడ్డు వరకు, ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మిస్తున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉందని, ఇందుకు అవసరమైన భూముల ను రక్షణ శాఖ ఇస్తున్నందున రూ. 303.62 కోట్లలను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఆయన చెప్పారు. ఈ మొత్తా న్ని కన్సాలిడేటెడ్ ఫండ్ ఇండియాకు చెల్లించే బదు లు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, డాక్టర్ లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల నేతృత్వంలో తాను కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానన్నారు. తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొన్న మోదీ ప్రభుత్వం రూ. 303.62 కోట్ల మొత్తాన్ని కంటోన్మెంట్‌లోని వివిధ అభివృద్ధి పనులకు వెచ్చిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇచ్చిందని రామకృష్ణ వెల్లడించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ తరహా అనుమతి ఇచ్చిన ప్రధాని మోదీతో పాటు కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, ఈటల రాజేందర్‌లకు కంటోన్మెంట్ ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌దే



మాట్లాడుతున్న సత్యం శ్రీరంగం

**బాలానగర్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రైతాంగం బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయలేదని వారిపై కక్ష్యగట్టి వారిని కేటీఆర్ రెచ్చగొడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎగదోస్తున్నాడని కూకట్‌పల్లి టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి ఘాటైన వాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు సొంతపార్టీ నేతలను పలుకరించలేదని, అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్‌ను నమ్మడం లేదని ఆరోపించారు. రైతులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దేనని, రెతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే దక్కిందని విమర్శించారు. రాబోయే నాలుగేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేసిన ప్రతీస్కాం బయటకు వస్తుందన్నారు. కేటీఆర్ మాటలు విని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికారులపై దాడికి పాల్పడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

# రోడ్డుపైనే వ్యాపారాలు

- కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లో నిత్యం రద్దీ
- ట్రాఫిక్‌కు అంతరాయం





రాందేవ్‌రావు హాస్పిటల్ నుంచి కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1 నిత్యం రద్దీగా ఉండే మార్గంలో చిరు వ్యాపారులు అడ్డా ఏర్పాటు చేసుకున్నారు. పండ్లు, కూరగాయాలు, డ్రై ఫ్రూట్స్ ఇతరత్రా కొనుగోలు కోసం బైక్‌లు, కార్లు ఆపుతుండడంతో ట్రాఫిక్‌జాం ఏర్పడుతోంది. పోలీసుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నా.. మామూళ్ల మత్తులో పోలీస్ సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులైనా కలగజేసుకొని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)





## ఆహ్వానం



బతుకమ్మబండలో ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ పురోహితుడు పరమేశ్వర పంతులు, కమిటీ సభ్యులు వెంకటేష్, అంజయ్య, శరణప్ప సూరారం సీఐ భరత్‌కుమార్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు.

- గాజులరామారం, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి)

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జన్మభూమికాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జన్మభూమికాలనీ, కమలమ్మనగర్, దత్తాత్రేయకాలనీ, మహారాజ్‌బండ, గుడ్‌విల్ హోటల్, భారతీయ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### స్వర్ణపురికాలనీలో..

మియాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణపురికాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో రోడ్ నంబర్-1 నుంచి 16 వరకు, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, మక్తామహబూబ్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.


చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణగౌడ్, పాస్టర్ గోపి

## చిన్నారులకు దుప్పట్ల పంపిణీ

హైదర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ఎన్టీఆర్‌నగర్‌లో భేతెల్ గాస్పల్ చర్చి పాస్టర్ ఎ.గోపి ఆధ్వర్యంలో గురువారం రాత్రి చిన్నారులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దొడ్ల రామకృష్ణగౌడ్ పాల్గొని చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రజలకు, పిల్లలకు ఉపయోగపడేలా ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న చర్చి పాస్టర్ గోపిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు మల్లేష్, ఫారూఖ్, ఖలీమ్, వెంకటకృష్ణ, సారా, డానియల్, భారత్‌గౌడ్, నాగేష్ పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ గుర్నాథం చెరువు, హఫీజ్‌పేటలోని కాయదమ్మకుంట చెరువుల సుందరీకరణ పనులకు శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే చొరవతో మల్లిగవాడ్ ఫౌండేషన్ సహకారంతో చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు.

## ఇగ్నో ప్రణాళికా మండలి సభ్యుడిగా హెచ్‌సీయూ ప్రొఫెసర్



హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ప్రణాళికా మండలి సభ్యుడిగా హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్స్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ నియమితులయ్యారు. ఇగ్నో కార్యకలాపాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించే ప్లానింగ్ బోర్డులో ఈయన మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ప్రొఫెసర్ వెంకటరమణ గతంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో డీన్‌గా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులై ఏడేళ్ల పాటు సేవలందించారు. రెండేళ్లపాటు బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు.



సదస్సు వివరాలను వెల్లడిస్తున్న బీఎంఎస్ నాయకులు

## నేటినుంచి పబ్లిక్ సెక్టార్ నేషనల్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ జాతీయ సదస్సు

భెల్‌కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు, హక్కులు, పదోన్నతులు ఇతర సమస్యలపై చర్చించి, కేంద్రానికి నివేదిక అందించేందుకు రెండు రోజుల పాటు జాతీయ స్థాయి పబ్లిక్ సెక్టార్ నేషనల్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ సదస్సును బీహెచ్ఈఎల్‌లో నిర్వహిస్తున్నామని బీఎంఎస్ భెల్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు, మహేష్, రాజ్‌కుమార్ తెలిపారు. భెల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సుకు బీహెచ్ఈఎల్, హెచ్ఏఎల్ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, టీహెచ్‌డీసీ, ఓఎన్‌జీసీ, ఐటీసీఎల్, నాల్కో, అలింకో, ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, బీడీఎల్, మిధాని, ఎఫ్‌సీఐ, ఐఆర్ఈఎల్, ఆర్ఈఐఎల్, హెచ్ఈసీ, ఎన్‌బీసీసీ సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్మికులందరూ పాల్గొని సమస్యలపై అభిప్రాయాలను తెలపాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌దే

బాలానగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగం బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయలేదని వారిపై కక్ష్యగట్టి వారిని కేటీఆర్ రెచ్చగొడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎగదోస్తున్నాడని కూకట్‌పల్లి టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి ఘాటైన వాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలను పలుకరించలేదని, అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్‌ను నమ్మడం లేదని ఆరోపించారు. రైతులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దేనని, రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకే దక్కిందని విమర్శించారు. రాబోయే నాలుగేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేసిన ప్రతీస్కాం బయటకు వస్తుందన్నారు. కేటీఆర్ మాటలు విని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికారులపై దాడికి పాల్పడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

## కనులపండువగా శ్రీనివాసుని ఊరేగింపు



భెల్‌కాలనీ, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి, జ్వాలాతోరణం వేడుకల సందర్భంగా భెల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. సతీ సమేతుడైన శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలను సుగంధ పుష్పాలు, ముత్యాలతో ఏర్పాటు చేసినప్రత్యేక పుష్ప పల్లకీపై దేవాలయ నలుదిక్కుల్లో ఊరేగించారు. శ్రీ యోగేశ్వర, యోగీశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను శివాలయం నుంచి పల్లకీలో దేవాలయ వరకు ఊరేగించారు. దేవాలయ గోపురం ఏదుట ఏర్పాటు చేసిన జ్వాలాతోరణం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఉత్సవ మూర్తులను తోరణం కింద నుంచి ఊరేగించారు. దేవాలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు.



### ప్రసిద్ధ క్షేత్రంగా

# భెల్ అయ్యప్ప ఆలయం

- స్వాములకు నిత్యాన్నదానం

భెల్‌కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా పవిత్రమైన మాసంగా భావించే కార్తీకమాసంలో దేశవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఉత్సవం అయ్యప్పస్వామి మాలధారణ. కార్తీకమాసంలో అయ్యప్పస్వామి భక్తులు మాలలు ధరించి అయ్యప్పస్వామి దేవాలయాన్ని, మకర జ్యోతిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, 41 రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు చేసి స్వామి దీక్షలో ఉండి శబరిమళ యాత్రచేసి, జ్యోతిసర్వరూపుడైన అయ్యప్పను దర్శించు కోవడంతో దీక్షలు పూర్తవుతాయి.



అన్నపూర్ణాదేవి నిత్యఅన్నదాన సత్రం


భెల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం

### భెల్‌లో అయ్యప్ప ఆలయం

అయ్యప్పస్వామి భక్తులు, మాలధారణ చేసే స్వాములకు ఆధ్యాత్మిక క్షేత్రంగా, శబరిమల తరహాలో పూజా కార్యక్రమాలకు వేదికగా మారింది భెల్ టౌన్‌షిప్‌లోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం. కేవలం కార్తీక మాసంలో అయ్యప్పస్వామికి నిర్వహించే ప్రత్యేక మాలధారణలు, మండల పూజలు సమయంలోనే కాకుండా నిత్యం అయ్యప్ప భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తూ నేడు జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్య క్షేతంగా మారింది.

### ఐదు దశాబ్దాల దేవాలయం

వివిధ భాషాలకు, విభిన్న ప్రాంతాలవారి కలయికలతో మమేకమైన బీహెచ్ఈఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కొందరు కేరళకు చెందిన కార్మికులు, భక్తులు మండల పూజల రోజుల్లో అయ్యప్పస్వామి మాలలు వేసుకుని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని స్వామివారి పాత కల్యాణ మండపంలో అయ్యప్ప మండపాన్ని ఏర్పాటు చేసి పూజలు చేసేవారు. 55 ఏళ్లుగా ఇదే విధంగా పూజలు నిర్వహించడంతో అనవాయితీగా వచ్చింది. ప్రతీ ఏటా అయ్యప్పస్వామి భక్తుల సంఖ్య పెరగడం, వేలాది మంది మాలధారణలు ధరించడం, పూజలు నిర్వహిస్తుండడంతో అయ్యప్పకు ప్రత్యేక దేవాలయాన్ని నిర్మించాలనే సంకల్పం కలిగింది. అయ్యప్పకు ప్రత్యేక దేవాలయాన్ని నిర్మించాలని భక్తులు, కాలనీవాసులు, కార్మికులు నిర్ణయించి స్థలాన్ని కేటాయించాలని భెల్ యాజమాన్యాన్ని కోరారు. వారి కోరికను గౌరవిస్తూ భెల్ యాజమాన్యం నాలుగు ఎకరాల స్థలం కేయించింది. దేవాలయ నిర్మాణానికి యాజమాన్యం పరోక్షంగా సహకరించగా భక్తులు, కార్మికులు విరాళాలు అందచేయడంతో దేవాలయ నిర్మాణానికి పునాది పడింది. దీంతో చిన్నపాటి నిర్మాణంతో ప్రారంభమైన అయ్యప్ప దేవాలయాన్ని దినదినాభివృద్ధి చేస్తూ దాదాపు కోటి రూపాయల వ్యయంతో పూర్తి స్థాయిలో ఆధునీకరించి జిల్లాలోనే అతిపెద్ద దేవాలయంగా మారింది. పంచలోహాలతో అయ్యప్ప స్వామి మూల విగ్రహాన్ని తయారుచేయించి, కేరళ సంప్రదాయం ప్రకారం ప్రతిష్ఠించారు. అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, భగవతి అమ్మవారు, నాగదేవతల ఆలయాలను సైతం నిర్మించారు.

### మొదలైన మాలధారణలు..

ప్రతీ ఏటా నవంబరు నెలలో ప్రారంభమైయ్యే మండల పూజల సమయంలో వేసుకునే అయ్యప్ప మాలలు ఇప్పటికే ప్రారంభమవగా మండల పూజలకు దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. డిసెంబరు 26 వరకూ జరిగే మండల పూజలు, అయ్యప్ప ఊరేగింపుతో ముగుస్తాయి. ఇప్పటికే దాదాపు 3 వేల మంది యువకులు, వృద్ధులు, పిల్లలు అయ్యప్ప దీక్షను తీసుకున్నారు.

### ఘనంగా మండల పూజలు

స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప భక్తుల శరణుఘోషలు, శబరిగిరీశుని నామస్మరణలతో భెల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం మండల పూజలు వైభవంగా ప్రారంభమైయ్యాయి. కేరళ సంప్రదాయ బద్ధంగా, ఆలయ తంత్రీల ఆధ్వర్యంలో విశేష పూజల నడుమ మండల పూజలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నాలుగు గంటలకు మహాగణపతి హోమం, అయ్యప్పస్వామికి ప్రీతిప్రదమైన నెయ్యి అభిషేకం, మూల విగ్రహానికి పంచామృతాభిషేకం తదితర విశేషపూజ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం దేవాలయ ప్రధాన గురుస్వామి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు మాలలు ధరించి దీక్షలకు శ్రీకారం చుట్టారు. కేరళ నుంచి వచ్చిన కళాకారులు రెండు గంటల పాటు పంచవాద్యాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రతీ రోజు ఉదయం 4.30 నుంచి 8.30 వరకు సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భజనలు, ప్రత్యేక పూజలు జరుతాయని నిర్వాహకులు తెలిపారు.

### నిత్యాన్నదాన సత్రం ప్రారంభం..

అయ్యప్ప దీక్షలను చేపట్టిన స్వాములు 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తుండడంతో వారి సౌకర్యార్థం దేవాలయ ప్రాంగణంలో అన్నపూర్ణదేవి కల్యాణ మండపంలో నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి డిసెంబరు 26 వరకు మండల పూజలు జరిగే ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు.

## దారి దోపిడీకి పాల్పడిన ఐదుగురి అరెస్ట్

హైదర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ప్రయాణించే వాహన దారులను లక్ష్యంగా చేసుకొని దారి దోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి జోన్ ఏసీపీ కె.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. బీర్బల్‌సింగ్ బీబాను(25), బాగేందర్‌సింగ్(29), రవిసింగ్‌బౌరి(20), దండు నగేష్(20) నలుగురు యువకులు స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించేందుకు వీరు ముఠాగా ఏర్పడి దారి దోపిడీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న రాత్రి కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 1లో లోధా అపార్ట్‌మెంట్ వద్ద అంకమ్మరావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనం అడ్డుకుని అతని బెదిరించి సెల్‌ఫోన్, చైన్ లాక్కున్నారు. కొంత సేపటికి రోడ్ నంబర్ 4లో వెంకట సురేష్, జగదీష్ వెళ్తున్న ద్విచక్రవాహన దారులను అడ్డగించి కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. రెండు కేసుల్లో బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలనగర్ సీసీఎస్ పోలీసులతో కలిసి బృందాలుగా ఏర్పడి నిందితులను అరెస్టు చేశారు. నలుగురు యువకులు రెండు బైక్‌లపై రెండు గ్రూపులుగా ఏర్పడి కాపలా కాస్తూ ఉంటే మరో గ్రూప్ బెదిరించి చోరీలకు పాల్పడతారని ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి కత్తి, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఘటన జరిగిన 24 గంటల్లో కేసును చేధించిన కేపీహెచ్‌బీ పోలీసులను ఏసీపీ శ్రీనివాసరావు అభినందించారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

### గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో..

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఓ దొంగతను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 5న తెల్లవారు జామున 2 గంటల సమయంలో సెనగల ప్రశాంత్, అతని భార్యతో కలిసి గచ్చిబౌలి నుంచి లింగంపల్లికి వెళ్తుండగా నెంబర్ ప్లేట్‌లేని స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు వారిని కత్తితో బెదిరించి వెండి గొలుసు, వెండి బ్రాస్‌లెట్, చెవిపోగులు, రెండు సెల్‌ఫోన్లు లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితులు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం మసీద్‌బండ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా స్కూటీపై వచ్చిన పహాడిషరీఫ్‌కు చెందిన సయ్యద్ జుబేర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీకాంత్

## ఇద్దరు పాతనేరస్థుల అరెస్ట్

రాయదుర్గం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విలాసాలకు అలవాటుపడి సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు పాతనేరస్థులను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. కిషన్‌బాగ్ బహదూరపురాకు చెందిన సర్దార్ కరణ్‌వీర్‌సింగ్(24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన సర్దార్ జగ్జోత్‌సింగ్ (23) డెలవరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా వీరిద్దరు కజిన్ సోదరులు. వీరుచెడు అలవాట్లకు బానిసలై పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆటో మొబైల్ దొంగతనాలకు పాల్పడ్డారు. దీంతో వీరిని గతంలో పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చారు. జగ్జోత్‌సింగ్ మియాపూర్, మాదాపూర్, ఆర్‌సిపురం, చందానగర్, కేపీహెచ్‌బీ, జీడీమెట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇళ్లలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చాడు. వీరు బయటకు వచ్చిన తర్వాత మారకుండా మళ్లీ కలిసి నేరాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 5న గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుదర్శన్‌నగర్ ప్రాంతంలో రెండు ద్విచక్రవాహనాలను బెదిరించి చోరీకి పాల్పడ్డారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు

భెల్‌కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గురునానక్ జయంతి సందర్భంగా బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని గురుద్వారాలో శుక్రవారం ప్రత్యేక భజనలు, ప్రార్థనలు సిక్కుల మతగురువుల ఆధ్వర్యంలో జరిగాయి. గురునానక్ జయంతిని గురుపురబ్, ప్రకాష్‌పర్వ్‌గా పిలుస్తారు. కార్తీక పౌర్ణమి గురునానక్ జయంతిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుడడంతో శుక్రవారం గురుద్వారాలో వేడుకలు ఘనంగా జరిగాయి. సిక్కులందరూ గురువుకు సంబంధించిన కీర్తనలు, లంగర్, అఖండ మార్గం, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సిక్కు మతాన్ని బలోపేతం చేయడంతో గురునానాక్ క్రియాశీలికంగా ఉండడంతో 555వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గురుద్వారాలో దీపాలను వెలిగించి భక్తి శ్రద్ధలతో వేడుకలు జరిపారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

- కిటకిటలాడిన ఆలయాలు

గచ్చిబౌలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 5 గంటల నుంచే శివాలయాలకు భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తారానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తారానగర్‌లోని తుల్జాభవాని ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న యాంకర్ సుమ, సింగర్ మంగ్లీ

### గచ్చిబౌలి టెలికాంనగర్‌లో

రాయదుర్గం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ధర్మపురి క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

### అభయాంజనేయస్వామి ఆలయంలో

రాయదుర్గం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులు దీపారాధనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజల్లో యాంకర్ సుమ, సింగ్ మంగ్లీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

### ధర్మపురి క్షేత్రంలో

మియాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఆలయ ట్రస్టీ గొట్టిపాటి సత్యవాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

శుక్రవారం ఉదయం నుంచి పరిసర కాలనీల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి దీపారాధాన, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు కార్తీక పౌర్ణమి ప్రత్యేక సందేశం అందించారు.


లింగంపల్లి, తారానగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



## సత్యసాయిబాబా మందిరంలో నేటినుంచి జయంతి వేడుకలు

భెల్‌కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్, పరిసర గ్రామాలు, ప్రాంతాల్లో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 23 వరకు శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. జయంతి వేడుకలను జరిపేందుకు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ రోజు బాబాకి నిర్వహించే నిత్య భజనలతో పాటు విశేష కార్యక్రమాలు జరుగనున్నాయి.

శనివారం ఓంకారం, నగర సంకీర్తన, రుద్రపారాయణం,విద్యార్థులతో సామూహిక పాదపూజలు, వాడల్లో నారాయణ సేవ సాయంత్రం రథోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆదివారం సామూహిక ఏకాదశ రుద్రపారాయణం, శ్రీసత్యసాయి అభిషేకం, భజన, సోమవారం సహస్రనామ పారాయణం, బాలవికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, సాయిరాం నామజపం జరుగుతాయన్నారు. 23న శనివారం బాబా జయంతి సందర్భంగా మహానారాయణ సేవ, విశేష పూజలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


భెల్ టౌన్‌షిప్‌లోని శ్రీ సత్యసాయి బాబా మందిరం

# శివోహం.. ఆధ్యాత్మిక సౌరభం

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు చేరుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. - గాజులరామారం, (ఆంధ్రజ్యోతి)


దర్శనం కోసం బారులు తీరిన మహిళలు


పండ్లతో శివలింగాన్ని అలంకరించిన భక్తులు


గాజులరామారం నల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


బ్యాంక్ కాలనీలో తులసి చెట్టు వద్ద కార్తీక దీపం వెలిగిస్తున్న భక్తులు


పేట్‌బషీరాబాద్‌లో శివాలయంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శివుడు

# గాజులరామారం సర్కిల్ పరిధిలో పడకేసిన పారిశుధ్యం

- పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యంతో ఎక్కడి చెత్త అక్కడే
- దోమల బెడదతో స్థానికుల అవస్థలు
- బేకరీ గడ్డను మరిచిపోయిన అధికారులు

**జీడిమెట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** గాజులరామారం సర్కిల్ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. వైద్యాధికారి, జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. ఎంటమాలజీ విభాగం అధికారుల అలసత్వంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పారిశుధ్యంపై ప్రతేక శ్రద్ధ పెట్టాలని సర్కిల్ కమిషనర్లు, ఏఎంహెచ్ఓలకు ఆదేశాలు జారీ చేస్తున్నా ఇక్కడ పనిచేస్తున్న అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టు వ్యవహరించడం వివాదస్పదంగా మారుతుంది. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ స్వయంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో పర్యటించి సక్రమంగా పారిశుధ్యం నిర్వహణ లేకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయినా ఇక్కడ అధికారులు, సిబ్బందిలో చలనం ఉండటం లేదు. దొంగలు దొంగలు ఊర్లుపంచుకున్న విధంగా జవాన్లు, ఎస్ఎఫ్ఏలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ బస్తీలు, కాలనీలలో పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవడం లేదు. వ్యాపారం కేంద్రాల ముందు పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ, షాపు నిర్వాహకుల నుంచి నెలవారి డబ్బులు వసూలు చేస్తున్నారని వినికిడి. ప్రధానంగా జగద్గిరిగుట్ట, శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్, చంద్రగిరినగర్, గాజులరామారం, హెచ్ఎంటీ పైప్‌లైన్‌రోడ్డు, సూరారం, లక్ష్మీనగర్, షాపూర్‌నగర్, రొడామిస్త్రీనగర్, నెహ్రూనగర్, దేవేందర్‌నగర్, రావినారాయణరెడ్డినగర్, మహదేవపురం, కైసర్‌నగర్, విశ్వకర్మకాలనీ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తుంది. దోమలు విపరీతంగా పెరిగిపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు కుట్టి విషజ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. హెచ్ఎంటీ పైప్‌లైన్‌రోడ్డులోని రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ చుట్టుపక్కల పెద్దఎత్తున చెత్త నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి జగద్గిరిగుట్ట వాసులు అవస్థలు పడుతున్నారు.

### సమస్యను పరిష్కరించాలి

రొడామిస్త్రీనగర్ బేకరిగడ్డ, హెచ్ఎంటీ ఖాళీ స్థలాన్ని అనుకుని ఉన్న ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలనే విషయాన్ని గాజులరామారం సర్కిల్ అధికారులు మరిచిపోయినట్టున్నారు. దీని ఫలితంగా ఎక్కడిచెత్త అక్కడే కుప్పలుకుప్పలుగా పేరుకుపోయింది. ఈ ప్రాంతంలో అసలు పారిశుధ్య పనులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. స్థానికులు అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. మేము వీరికి మనుషుల్లా కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. దోమలు వ్యాప్తి చెంది ఇక్కడ నివసించాలంటేనే భయమేస్తుందని మహిళలు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి బేకరిగడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బేకరిగడ్డ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు

# చింతచెరువు కట్టకు ఎసరు

- బాహాటంగా ఇసుక, పౌడర్ డంప్
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

**దుండిగల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** గండిమైసమ్మ దుండిగల్ మండలం, డి.పోచంపల్లి గ్రామ పరిధిలోని చింతచెరువు కట్టను ఇసుక కంకర, పౌడర్, ఇటుకల వ్యాపారానికి అడ్డాగా మార్చారు. స్థానికంగా మెటీరియల్ వ్యాపారం చేసుకుంటున్నవారు కట్టను మొదట్లో ఎక్సకవేటర్‌తో కొంతమేర వెడల్పు చేసి, వ్యాపారాన్ని మొదలు పెట్టారు. చెరువుకు ఒక పక్కన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న విషయమై రెవెన్యూ అధికారులు పలు దఫాలు చర్యలు తీసుకోవడంతో పాటు కొందరు బిల్డర్లపై కేసులు కూడా నమోదుచేశారు. ఒక పక్క ఇది జరుగుతుండగా, మరోపక్క ఈ దళారి వ్యాపారులు ఏకంగా కట్టకే ఎసరు పెట్టారు. ఎక్సకవేటర్‌తో చదునుచేసి, ప్రధానరోడ్డుకు ఆనుకొని ఉన్న కట్టను తమకు వ్యాపారాలకు అనుకూలంగా మలుచుకున్నారు. కట్టపై బాహాటంగా ఇసుక, పౌడర్‌ను డంప్ చేసి, అమ్ముకోవడం కోసం ఒక ఎక్సకవేటర్‌ను కూడా అక్కడే ఏర్పాటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా, రెవెన్యూ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి, ఆదిలోనే అడ్డుకట్ట వేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.


చింత చెరువు కట్టను చదును చేసి ఇసుక, కంకర, పౌడర్, అక్రమ వ్యాపారం


కట్ట మీదనే అమ్మకం కోసం వేసిన మెటీరియల్

# పొంగుతున్న డ్రైనేజీ.. ప్రమాదకరంగా రోడ్డు

**దుండిగల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డులో నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. ఒకపక్క రోడ్డుపై డ్రైనేజీ పారడం, మరోపక్క మ్యాన్‌హోల్ కుంగిపోవడం వంటి కారణాలతో నిత్యం రాకపోకలు సాగించే పలు కాలనీల ప్రజలు నరకం చూస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు స్పందించినా, తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ సమస్య నిత్యం పునారావృతం అవుతుంది. వాస్తవంగా రోడ్డు నిర్మాణానికి ముందే డ్రైనేజీని పక్బందీగా నిర్మించి, మ్యాన్‌హోల్స్ కృంగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ఈ రోడ్డు మూల మీద ఉన్న ప్రభుత్వ పాఠశాల నుంచే ఈ డ్రైనేజీ మురుగు రావడం పెద్ద శాపంగా మారింది. కాబట్టి మున్సిపల్ అధికారులు, ఇంజనీర్లు ఈ రోడ్డు విషయంలో శ్రద్ధ తీసుకొని భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.


ప్రభుత్వ పాఠశాల ముందు పొంగుతున్న డ్రైనేజీ, ఏర్పడ్డ గుంతలు, ప్రమాదకరంగా వెళుతున్న బైక్


మల్లంపేట ప్రధాన రోడ్డుపైన చేరిన వర్షపు నీరు

## కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కొలన్

**దుండిగల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** అర్హులైన వారందరూ కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లో జయరామ్‌నగర్‌కు చెందిన అనిల్ సోదరి భారతికి మంజూరైన రూ.1 లక్ష 116 రూపాయల కల్యాణలక్ష్మి చెక్కును బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్‌వర్మ, అనీల్ లక్ష్మి, అండాలు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కును అందిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

## విగ్రహాలను మార్చారు.. పాత దిమ్మెను కూల్చడం మరిచారు

**గాజులరామారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** గాజులరామారం గ్రామ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను కమిటీ సభ్యులు రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా రోడ్డు పక్కన దిమ్మెను నిర్మించి విగ్రహాలను ఏర్పాటుచేశారు. పాతదిమ్మెను కూల్చివేయకుండా వదిలి వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాతదిమ్మను తీసివేసి, రోడ్డువెడల్పుకు సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.


గాజులరామారం గ్రామ చౌరస్తాలో వదిలివేసిన పాత దిమ్మె

# కార్మికుల సంక్షేమానికి కృషి

- సీపీఐఎం మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి సత్యం

**నిజాంపేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో మేడ్చల్ జిల్లా సీపీఐఎం పార్టీ 3వ మహాసభల లోగోను జిల్లా కార్యదర్శి పి.సత్యం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా నాలుగు లేబర్‌కోడ్స్‌ను తీసుకువచ్చిందని ఆరోపించారు. కనీస వేతనాన్ని మూడు పర్యాయాలుగా సవరించకపోవడంతో, కార్మికవర్గం అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులుగా ఉన్న ఈటల రాజేందర్ కార్మికవర్గ సమస్యలపై స్పందించడం లేదన్నారు. అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం కృషి చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామాయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, మండల జిల్లా నాయకులు వర ప్రసాద్, సంతోష్, లక్ష్మణ్, నరేష్, ఎం. శంకర్, రాజశేఖర్, ఎం. చంద్ర శేఖర్, బాల వెంకటేశ్వరరావు, అక్బర్, కౌశిష్, కురాన్ ఉన్నారు.


లోగోను ఆవిష్కరించి, నినాదాలు చేస్తున్న సీపీఐఎం నాయకులు

## గుర్తు తెలియని మహిళ హత్య

**దుండిగల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** బహదూర్‌పల్లి టెక్‌మహేంద్ర పరిశ్రమ ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో తలకు బలమైన గాయమై పడిఉన్న 40 నుంచి 45 మధ్య వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. మహిళ పూర్తి వివరాలు తెలియలేదని సీఐ సతీష్ తెలిపారు. శుక్రవారం ఉదయం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పోలీసులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమెను ఇక్కడకు తీసుకువచ్చి చంపేశారా? మరెక్కడైనా చంపి తీసుకువచ్చి పడవేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతానికి గుర్తు తెలియని మహిళ మృతదేహంగా గాంధీలో భద్రపరిచినట్లు, మహిళ ఆచూకి తెలిస్తే దుండిగల్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.


మహిళ మృత దేహం

## కృషి కాలనీలో అక్రమ నిర్మాణం సీజ్

**కుత్బుల్లాపూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్ కృషికాలనీలో రోడ్డును కబ్జాచేసి నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీ నర్సింహ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్‌చేసి ఆధీనంలోకి తీసుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ బట్టల దుకాణం వ్యాపారి రోడ్డుపైన ఉన్న స్తంభాలను తొలగించి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని సీజ్ చేశారు.


ఆధీనంలోకి తీసుకున్న అక్రమ నిర్మాణం

## ఇన్‌కాయస్‌ను సందర్శించిన బిర్లా ట్రస్ట్ సభ్యులు

**దుండిగల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** ప్రగతినగర్ ఇన్‌కాయస్‌ను బిర్లా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మలా బిర్లా, ట్రస్ట్ బోర్డు సభ్యులు, బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కేఎం రెడ్డి సందర్శించారు. ఇన్‌కాయస్ అందిస్తున్న సేవలు పట్ల సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణన్ నాయర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిర్లా సైన్స్ సెంటర్‌లో ఇన్‌కాయస్ అందిస్తున్న ప్రొడక్టన్‌ను బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రదర్శిస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కాయస్ సైంటిస్టు ఎన్ శ్రీనివాసరావు, సంస్థ సీనియర్ అడ్మినిస్ట్రేషన్ఆఫీసర్ నాగేశ్వరరావు, శ్రీరంగం, దాసరి ప్రసాద్, సి.ఏ. శ్యామ్ కొఠారి పాల్గొన్నారు.


ఇన్‌కాయస్ ప్రతినిధులతో సమావేశమైన బిర్లా ట్రస్ట్ సభ్యులు

## పార్కింగ్‌గా మారుతున్న పార్కు స్థలాలు

**జీడిమెట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో కాలనీవాసుల కోసం హౌజింగ్ బోర్డు అధికారులు వదిలిన పార్కుల స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. కొందరు వ్యక్తులు ఇప్పటికే పార్కు స్థలాలను కబ్జాలు చేశారు. మిగిలిన స్థలాల చుట్టూ కాంపౌండ్ వాల్‌లు నిర్మించిన సర్కిల్ అధికారులు పార్కుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పార్కు స్థలాలను కొందరు వెల్ఫేర్ అసోసియేషన్ ముసుగులో కబ్జాలకు పాల్పడుతూ, వాటిలో పార్కింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అధికారులు తక్షణమే నిరుపయోగంగా ఉన్న పార్కు స్థలాలను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పార్కు స్థలాల్లో వాహనాల పార్కింగ్

## ట్రాఫిక్ జామ్

కార్తీకమాసం సందర్భంగా నిజాంపేట్ గ్రామం సాయిబాబా ఆలయం నుంచి జర్నలిస్టు కాలనీ వాటర్‌ట్యాంక్ రోడ్‌లో దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆలయానికి వచ్చిన వాహనదారులు తమ కార్లు బైక్‌లను రోడ్డుపైనే పార్క్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విచారకరం.
- నిజాంపేట్(ఆంధ్రజ్యోతి)




గాజులరామారం చౌరస్తాలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. చిత్తారమ్మ ఆలయం నుంచి గాజులరామారం చౌరస్తా వరకు, మల్లారెడ్డినగర్ నుంచి గాజులరామారం వరకు వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. వాహనదారులు ముందుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.
- గాజులరామారం (ఆంధ్రజ్యోతి)